క్లుప్తంగా

మహాశివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనలో మహాశివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి, కనిగిరి డీఎస్పీ ఎ.సాయి ఈశ్వర్ యశ్వంత్‌లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆలయం వద్ద అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతు ఉత్సవాల్లో తాగునీరు, ట్రాఫిక్, వైద్యం, కనీస అవసరాలకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ కే.శ్రీనివాసరెడ్డి, సీఐ భీమానాయక్, తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి, ఎస్సై ఆర్.సుమన్, యారవ శ్రీనివాసులు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, బొబ్బూరి రమేష్, మన్నేపల్లి శ్రీనివాసులు, లక్ష్మీదేవి, అర్చకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

హనుమంతునిపాడు: ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకొని ప్రయాణం సాగించడం వల్ల రోడ్డు ప్రమాదాలుజరుగుతున్నాయని ఎస్సై మాధవరావు అన్నారు. ఈ మేరకు స్థానిక కంభం రోడ్డులో ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం హాజీపురంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

కార్మికులకు వేతనాలు ఇవ్వాలని నిరసన


వినతిపత్రం ఇస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు

సీఎస్‌పురం(పామూరు): గ్రామాల్లో స్వచ్ఛభారత్ కింద పనిచేసే కార్మికులకు పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించి ఆదుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షుడు ఎస్.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ నెలల తరబడి వేతనాలు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణం వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. ఏ.దయానందం, సంగటి భాస్కర్, చిన్నయ్య, కుక్కల వెంకటేశ్వర్లు, నందిపోగు జాన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్‌ను పరిశీలించారు. ల్యాబ్‌లో ఎందుకు పరీక్షలు చేయడం లేదని ప్రశ్నించగా..రక్త పరీక్షలకు అవసరమైన మందులు లేకపోవడంతో గత వారం రోజులుగా పరీక్షలు నిలిపివేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన మందులు సమకూరిస్తే మెరుగైన వైద్య అందుతుందన్నారు. ఆరోగ్య కేంద్రంలోని వైద్యుల పనితీరు, రక్త పరీక్షలు నిర్వహించకపోడం, విధి నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బంది వివరాలను జిల్లా ఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

రైతులు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటరమణ

పీసీపల్లి: మండలంలోని పెద అలవలపాడు, మురుగమ్మి, పెద యిర్లపాడు, వెంగలాయపల్లి, చింతగుంపల్లి, పీసీపల్లి గ్రామాల్లో ఏడీఏ వెంకటరమణ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పథకాలు పొందాలంటే ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరి పేర్కొన్నారు. ఏఈఓ పుల్లయ్య, వీఏఏ శ్రావణి, రామ్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రసూల్, సాయి ప్రియ మనోహర్, రైతులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: రైతులంతా విధిగా పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి రమణ అన్నారు. మండలంలోని నందనవనం, పెద్దగొల్లపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీఈఓ గోపికృష్ణ, వీఏఏలు కాశయ్య, సుప్రజ, లక్ష్మీ, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉపాధి కరువై.. బతుకు భారమై..!

- గ్రామాల్లో నిలిచిపోయిన ఉపాధి పనులు
- వేలల్లో కూలీలున్నా వందల సంఖ్యలో కూలీలకు మాత్రమే పని
- అధికార పార్టీ నేతలు చెప్పిన వారికే పని
- వేధిస్తున్న సిబ్బంది కొరత


సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న ఏపీఓ గది


పనులు చేస్తున్న కూలీలు

పీసీపల్లి:

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ఎంతో మందికి బువ్వ పెడుతోంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కూలీలకు ఉపాధి పనులు కల్పించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. ఆ తరువాత నుంచి పథకం పూర్తిగా నీరుగారిపోయింది. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పనుల గుర్తింపు, ఆమోదం వీటన్నింటినీ పూర్తిగా మరిచిపోయారు. దీంతో వేల సంఖ్యలో జాబ్‌కార్డులు ఉన్నా వందల సంఖ్య కూలీలకు కూడా పనులు కల్పించడం లేదు.

12వేల కార్డులు..6 వేల మంది కూలీలు

మండల పరిధిలోని మొత్తం 18 పంచాయతీల్లో 65 గ్రామాలు ఉన్నాయి. 65 గ్రామాల్లో సుమారు 12000 జాబ్ కార్డులు ఉన్నాయి. 6000 మంది కూలీలు ఉన్నారు. వీరిలో 3,000 మంది మాత్రమే పనికి వెళ్తుంటారు. కాగా వీరిలో 10 పంచాయతీల్లో పని జరుగుతుంది. అయితే ప్రస్తుతం 300 మంది కూలీలకు మాత్రమే పని కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో ఉపాధి పని కూడా లేకపోవడంతో పనులు లేక కూలీలు విజయవాడ, బెంగళూరు, హైదరాబాద్‌లలో బేల్దారీ పనులకు వెళుతున్నారు.

అధికార పార్టీ నేతలు చెబితేనే..

గతంలో పార్టీలతో సంబంధం లేకుండా పని అడిగిన వారందరికీ పని కల్పించేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికార పార్టీ నేతలు పూర్తిగా నీరుగార్చేశారు. అధికార పార్టీ నేతలు చెప్పిన వారితో సంఘాలు ఏర్పాటుచేసి వారికే పని కల్పిస్తున్నారు. దీంతో పని కోసం ఎవరన్నా ఎదురుచూసినా పని కల్పించే పరిస్థితి లేకుండా పోయింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత...

గతంలో అవినీతి చేశారని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని మొత్తం సస్పెండ్ చేయడంతో ఇక్కడ సిబ్బంది కొరత ఏర్పడింది. ఏపీవో పోస్టు ఖాళీగా ఉంది. దీంతో పొన్నలూరు ఏపీఓను ఇన్‌చార్జిగా నియమించారు. అతను కూడా ప్రస్తుతం రావడం లేదు. ఈసీ కూడా కనిగిరి నుంచి ఇన్‌చార్జిగా ఉండగా ఇక్కడకు రావడం లేదు. ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఆరుగురు ఉండాల్సి ఉండగా ముగ్గురే ఉన్నారు. ఇక ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ ఇటీవల అనారోగ్యంతో సమస్య సెలవుపై వెళ్లడంతో ఇక్కడ పూర్తిస్థాయిలో పర్యవేక్షించే వారే కరువయ్యారు. రెండు వారాలు బిల్లులు చేస్తే చెక్ మెజర్మెంట్ కాక బిల్లులు పడలేదని, అందుకే గ్రామాల్లో కూలీలకు మేం పని కల్పించలేకపోతున్నామని ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు చెబుతున్నారు.

ఉపాధిలో ఆగని అక్రమాలు....

ఇక ఉపాధి పనుల్లో అక్రమాలు మాత్రం ఆగడం లేదు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని పండలంలో పనిచేస్తున్న ఏపీఓ నుంచి కంప్యూటర్ ఆపరేటర్ వరకు పది మందిని సస్పెండ్ చేశారు.

1700 మందికి పని కల్పించాలని లక్ష్యం..

ఈ విషయంపై కనిగిరి ఏపీడీ రాజారావును వివరణ కోరగా ఈ వారం 1700 మందికి పని కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించామని పేర్కొన్నారు. 18 పంచాయతీల్లో పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రావు

పామూరు: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు రానున్న బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని, మోపాడు రిజర్వాయర్‌కు వెలిగొండ ప్రాజెక్ట్ నీటిని 2 టీఎంసీలు కేటాయించాలి ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు అన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్‌కు నీటికేటాయింపులు, మోపాడుకు వెలిగొండనీరు సరఫరాపై స్థానిక పద్మావతి గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఎం.ప్రసాద్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ 2025–26 వార్షిక బడ్జెట్‌లో వెలిగొండ మొదటి దశపనులు పూర్తి కోసం రూ.2 వేలకోట్లు కేటాయించి మొదటి దశ పనులను పూర్తిచేయాలన్నారు. ప్రాజెక్ట్ వల్ల నష్టపోయిన రైతులకు పునరావాసం కల్పించి మొదటిదశ సాగుకు నీరు ఇవ్వాలని , దుకోసం పశ్చిమ ప్రాంతంలోని ఎమ్మెల్యేలంతా ఐక్యమై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. లేకుంటే పార్టీలకు అతీతంగా ప్రజలను చైతన్యవంతుల చేసి ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఫ్లోరైడ్ రక్కసితో బాధపడుతున్న కనిగిరి, పామూరు, పీసీపల్లి మండలాల ప్రజలను కాపాడాలని, వలసలు నివారించాలన్నారు. మోపాడు రిజర్వాయర్‌ను వెలిగొండ ప్రాజెక్ట్ పరిధిలో చేర్చి 2 టీఎంసీల నీరు మోపాడుకు వచ్చేలా చూడాలన్నారు. దీనిపై ఈనెల 20వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ, వినతిపత్రాలు అందజేత కార్యక్రమం నిర్వహించాలన్నారు. వ్యవసాయ కార్మికసంఘం నాయకులు సయ్యద్‌మౌలాలి, వై.వి.నారాయణ, రఘునాథరెడ్డి, కే.శంకర్, మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, వెంకటరత్నం, కె.మాల్యాద్రి, హనీఫ్, శివరామయ్య, పి.కృష్ణయ్య, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రుణాలు త్వరితగతిన వసూలు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్

పీసీపల్లి: స్త్రీ నిధి రుణాలు త్వరితగతిన రికవరీ చేయాలని స్త్రీనిధి కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డేవిడ్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం స్త్రీనిధిపై వెలుగు సీసీలు, వీఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీపల్లి పంచాయతీలో స్త్రీ నిధి రుణాలు రికవరీ కావడం లేదన్నారు. ఏజీఎం హర్షవర్ధన్ మాట్లాడుతూ వీఓఏలు వసూలు చేసి నగదు వెంటనే ఖాతాలో జమ చేయాలన్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో సభ్యుల దగ్గర వసూలు చేసిన నగదు సొంతంగా వాడుకున్నారని తెలిసిందని, వసూలు చేసిన నగదు వెంటనే జమ చేయాలని, లేకుంటే శాఖాపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రుణాలు మంజూరైన తరువాత గ్రూపుల వద్ద కూడా నగదు వసూలు చేస్తున్నట్లు తెలిసిందని, మరోసారి ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని వెలుగు సిబ్బందిని హెచ్చరించారు. డీపీఎం డేవిడ్, ఏరియా కో ఆర్డినేటర్ అంబేద్కర్, ఏపీఎం సత్యానందం, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల పట్ల అప్రమత్తత అవసరం


మాలపాడులో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: విద్యార్థినులు ఆకతాయిలు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అనూక్ పేర్కొన్నారు. మండలంలోని మాలపాడు కేజీబీవీ విద్యార్థినులకు మంగళవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పాఠశాలకు వచ్చి వెళ్లే క్రమంలో ఎవరైనా ఆకతాయిలు వెంటపడి వేధిస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి ఉన్నత చదువులు అభ్యసించాలన్నారు. చిన్నతనంలోనే చెడు వ్యసనాలకు లోను కాకుండా లక్ష్యంతో చదువుకోవాలన్నారు. బాలికలు చిన్న వయస్సులోనే వివాహాలు చేసుకోవడం వలన సాధికారతను కోల్పోతారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సైబర్ నేరాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రిన్సిపాల్ సుభాషిణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లీశ్వరరావు

టంగుటూరు: వాహనదారులు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ హెల్మెట్ ధరించాలని సీఐ హజరత్తయ్య సూచించారు. స్థానిక టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆటో డ్రైవర్లు కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ట్రాక్టర్ల డ్రైవర్లు, ట్రక్కు డోర్లు తీసి ప్రయాణించకూడదని తెలిపారు. అనంతరం వాహన తనిఖీలు నిర్వహించి 250 మంది వాహనదారులకు రూ.40 వేల జరిమానా విధించారు.

కొండపి: కొండపి నుంచి కట్టావారిపాలెం వెళ్లే రహదారిలో సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రమాదాలసమయంలో హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని సూచించారు. ప్రతి ఒక్కరో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. హోంగార్డు రాజశేఖర్, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు 456 దరఖాస్తులు

సింగరాయకొండ: జిల్లాలోని వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలకు సంబంధించి 456 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ డి.జయమణి తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు 341 మంది, ఈబీసీ కార్పొరేషన్‌కు 35 మంది, కాపు కార్పొరేషన్‌కు 80 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ దరఖాస్తులను ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు పరిశీలించి ఈ నెల 25న అర్హుల జాబితా సిద్ధం చేస్తామన్నారు. లబ్ధిదారులు ఏర్పాటు చేసే యూనిట్లను బట్టి వారికి 30 నుంచి 50 శాతం సబ్సిడీ వచ్చే అవకాశం ఉందన్నారు. ఎంపికైన అభ్యర్థులు తప్పనిసరిగా యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

'జ్ఞానజ్యోతి' సద్వినియోగం చేసుకోండి


శిక్షణలో పాల్గొన్న ఎంపీడీఓ రమణమూర్తి

జరుగుమల్లి(సింగరాయకొండ): జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. స్థానిక జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరురోజుల శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీఓ రమణమూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయడంతో పాటు చిన్నారులను పాఠశాలలో చేర్పించే నాటికి వారికి చదువుపై శ్రద్ధ కలిగేలా తీర్చిదిద్దాలన్నారు. ఎంఈఓ–1 బి.నాగేంద్రవదన్, ఎంఈఓ–2 డి.శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఎం శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి


మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్

సింగరాయకొండ: ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ ప్రకారం కార్పొరేషన్ల ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు సబ్సిడీ రుణాలు అందజేసి ప్రోత్సహిస్తున్నామని లీడ్ బ్యాంకు మేనేజర్ డి.రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని సింగరాయకొండ, పొన్నలూరు, జరుగుమల్లి, టంగుటూరు, కొండపి మండలాల బ్యాంకర్లు, ఐకేపీ అధికారులతో ప్రభుత్వ రుణాల పురోగతిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్యాంకర్లు, ఐకేపీ అధికారులతో సమావేశం నిర్వహించి సబ్సిడీ పథకాల ఋణాల మంజూరు, గ్రౌండింగ్‌లపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు రుణాలపై 35 శాతం సబ్సిడీ, బీసీలకు 25 శాతం సబ్సిడీపై రుణాలు అందజేస్తామన్నారు. ప్రస్తుతం 5 మండలాల్లో సుమారు 100కు పైగా యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి అర్హులైన లబ్దిదారులకు నెలాఖరు లోగా యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా కృషి చేయాలని బ్యాంకర్లకు సూచించారు. ప్రతి మండలంలో రూఫ్ టాప్ సోలార్‌సిస్టం యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద 5 మండలాల్లోని 40 బ్రాంచ్‌లలో సుమారు 500కు పైగా దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటికి కేవలం 50 యూనిట్లు మాత్రమే గ్రౌండ్ అయ్యాయని మిగిలిన యూనిట్లు కూడా త్వరగా ఏర్పాటయ్యేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ముందస్తు శిక్షణ నిర్వహించామన్నారు. డీఆర్‌డీఏ బ్యాంకు లింకేజ్ అధికారి సనిత, రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, డీఆర్‌డీఏ కొండపి ఏసీ కత్తి కళ్యాణ్, ఏపీఎంలు, సీసీలు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

బోర్డ్ ఆధ్వర్యంలో విజ్ఞానయాత్ర


ప్లాంట్‌ని సందర్శిస్తున్న రైతులు, సిబ్బంది

కొండపి: కొండపి పొగాకు బోర్డు పరిధిలోని రైతులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి పొగాకు బోర్డ్ వేలం నిర్వహణ అధికారి జి. సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విజ్ఞాన యాత్ర నిర్వహించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా కరేడు జీపీఐ టొబాకో త్రెస్సింగ్ ప్లాంట్ను సందర్శించారు. రైతులు క్షేత్ర స్థాయి సిబ్బంది రైతుల దగ్గర కొనుగోలు చేసిన పొగాకును ఎటువంటి పద్ధతి ద్వారా అంతర్జాతీయ కొనుగోలుదారులకు విక్రయిస్తారో , పొగాకు ప్యాకింగ్‌లో పాటించాల్సిన అంతర్జాతీయ ప్రమాణాలను తెలుసుకున్నారు. జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రావు, సీనియర్ మేనేజర్లు హెచ్‌వీ పునీత్, మదన్, హఫీజ్ శ్యామల, డెవలప్మెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, పొగాకు బోర్డు సిబ్బంది, వేలంకేంద్రం పరిధిలోని రైతులు పాల్గొన్నారు

అంగన్‌వాడీలు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ హరిబాబు


శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయమణి

పొన్నలూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంఈఓ–2 తన్నీరు హరిబాబు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాల్లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ×జ్ఞానజ్యోతి×పై శిక్షణ నిర్వహించి నూతన విద్యా అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న విద్యా విధానాలపై అంగన్‌వాడీలు అవగాహన కలిగి చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్నారు. అంగన్‌వాడీ చిన్నారుల సమగ్ర విద్యాభివృద్ధికి ఎప్పటికప్పుడు సృజనాత్మక బోధన అందించాలన్నారు. ఎంపీడీఓ సుజాత, ఎంఈఓ రవిచంద్రబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, హెచ్‌ఎం వెంకట్రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరాయకొండ: అంగన్‌వాడీ దశలోనే చిన్నారులకు జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా విద్య నేర్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ డి.జయమణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞానజ్యోతి పథకం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఎంపీడీఓ జయమణి మాట్లాడుతూ అంగన్‌వాడీ దశలోనే చిన్నారులను విద్యావంతులను చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల హాజరుశాతం తక్కువగా ఉంటుందని, కొన్ని సెంటర్లలో 10 మంది చిన్నారులు కూడా ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ టి.రవి, టంగుటూరు సీడీపీఓ సీహెచ్ మల్లీశ్వరి, ఎంఈఓ–1 కత్తి శ్రీనివాసరావు, ఎంఈఓ–2 ఆవుల శ్రీనివాసులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీఆర్పీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరమని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం సమగ్రశిక్ష, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ప్రారంభించారు. సూపర్‌వైజర్ కె.దేవకృపావరం, ఆర్పీలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులను ఎంఈఓ పెద్దిరాజు ప్రారంభించారు. ఎంఈఓ ఎస్ రమణయ్య, కాంప్లెక్స్ చైర్మన్ బొప్పరాజు సుబ్బారావు, సూపర్‌వైజర్ షేక్ గౌస్‌నీషాబేగం పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్ట


సరస్వతీ దేవి విగ్రహంతో పూర్వ విద్యార్థులు

కొండపి: మండలంలోని కె. ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సరస్వతీ విగ్రహాన్ని పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా మంగళవారం విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ రామారావు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయుడు సూసన్నకుమార్, దాకా పిచ్చిరెడ్డి, వాకా నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, మాజీ విద్యా కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శర్మ, విద్యా కమిటీ చైర్మన్ బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి


కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న మంత్రి స్వామి

కొండపి: వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని మంత్రి స్వామి అన్నారు. మండలంలోని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాల పరిసరాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు గురించి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యశాలకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. గుండెపోటుకు వైద్యశాలలోని వైద్యులు ప్రథమ చికిత్స అందించేందుకు అన్ని పరికరాలు ఉన్నాయని, గుండెపోటుకు గురైన వారు సుదూర ప్రాంతాలకు వెళ్లే ముందు వైద్యశాలకు వచ్చి ప్రథమ చికిత్స చేయించుకోవాలని సూచించారు. త్వరలోనే వైద్యశాలలో ఆపరేషన్లు ప్రారంభిస్తామని, టెక్నికల్ సిబ్బందికి శిక్షణ అవసరమని వారికి తగిన శిక్షణ ఇస్తామని తెలిపారు. వైద్యశాల సూపరింటెండెంట్ వరలక్ష్మి, వైద్యులు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకలేదు


కామేపల్లిలో కోళ్లఫారాన్ని పరిశీలిస్తున్న పశువైద్యాధికారి శ్రావణి

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని కోళ్లఫారాలలో బ్రాయిలర్ కోళ్లు ఆరోగ్యవంతంగా ఉన్నాయని, బర్డ్‌ఫ్లూ సోకలేదని ప్రజలు ఆందోళన చెందవద్దని పశువైద్యాధికారి జె.శ్రావణి తెలిపారు. మండలంలోని కామేపల్లిలోని కోళ్లఫారాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. బయో సెక్యూరిటీ పాటించడం కోళ్లకు వైరస్ సోకకుండా నివారించవచ్చని సూచించారు. వైరస్ ఉన్న జిల్లాల నుంచి కొద్దిరోజుల పాటు కోళ్లను దిగుమతి చేసుకోవద్దని సూచించారు. కోళ్లకు వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె రైతులకు వివరించారు.

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోండి


మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ డాక్టర్ మూర్తి

పామూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని ఆ దిశగా విద్యాభ్యాసం చేయాలని ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డీవీఆర్ మూర్తి, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అక్షర విద్యాసంస్థల వార్షిక వేడుకలు కళాశాల కరస్పాండెంట్ కదిరి బాబూరంగారావు, కదిరి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబు, పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కందుకూరు డివిజన్
90102 24456

Office mail : sakshiongads@gmail.com